సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 14 । జూన్ । 2023



స్త్రీ నిధి సొమ్ము స్వాహా
స్త్రీ నిధి రుణాల సొమ్ము రూ.14,62,176 బ్యాంకుకు జమ చేయకుండా వాడుకున్నారని వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం సుభాషిణి ఆరోపించారు. 8లో ▸



151 మందికి ఉద్యోగాలు
ఏలూరు నియోజకవర్గ పరిధిలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 151 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి చెప్పారు. 8లో ▸



వరిగడ్డి కాల్చితే అనర్థమే
వరిగడ్డిని చేలల్లో కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు తలెత్తుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.
8లో ▸

న్యూస్‌రీల్

సీఎం జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ. చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి తదితరులు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్ పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు మంగళవారం ఉదయం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సామాజిక న్యాయంలో భాగంగానే బలహీన, బడుగు వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలన్నారు. గ్రామ సీమల అభివృద్ధికి అధికారులను సమన్వయం చేసుకుంటూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విశదీకరించాలని, లబ్ధిదారులను నేరుగా కలవాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): పురపాలక సంఘం పరిధిలో గునుపూడి ఇందిరాగాంధీ ప్రత్యేక ప్రాథమిక పాఠశాల, నరసయ్య అగ్రహారం బందా వీర్రాజు పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టరు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తలుపులు, రహదారి, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఓటరు జాబితాలను పరిశీలించారు. వివాదాలకు తావు లేకుండా జాబితాలు ఉండాలని బీఎల్‌ఓలను కలెక్టరు ఆదేశించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 38 శాతంతో 3,736 మంది ఉత్తీర్ణులు కాగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 32 శాతంతో 3,701 మందియ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 8,397 మంది హాజరు కాగా వారిలో 2,989 మంది ఉత్తీర్ణులు కాగా ఒకేషనల్ విద్యార్థులు 1,461 మందికి 747 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 9,312 మందికి 2,928 మంది ఉత్తీర్ణులయ్యారని, 2,088 మంది ఒకేషనల్ విద్యార్థులకు 773 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

2.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): 2022–23 రబీ పంటకు సంబంధించి ఏలూరు జిల్లాలో 2.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏప్రిల్ 16న ప్రారంభించి, ఇంతవరకు జిల్లాలో 22 మండలాల్లోని 145 రైతు భరోసా కేంద్రాల నుంచి సేకరణ చేశామన్నారు. మొత్తం 2.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందుకు సంబంధించి రూ.434 కోట్లు సంబంధిత రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి అన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ అధికారి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రం, బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జులై 16 వరకు ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

రక్తదాతలకు సలాం

- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం
- జిల్లాలో ఏడాదికి 19,000 యూనిట్ల రక్తం సేకరణ



భీమవరంలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల రక్తదాన శిబిరం (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానాన్ని మించినది మరొకటి లేదు. మరొకరికి ప్రాణం దానం చేసే రక్తదాతల సేవా నిరతి ఎంతో గొప్పది. రక్తదానం చేస్తున్న దాతల్ని ప్రశంసిస్తూ జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, యువతతో పాటు సామాన్యులు సైతం రక్తదానం చేస్తున్నారు. రక్తదానం విలువ తెలిసిన వారిగా దాతలు ముందుకు వచ్చి దానం చేయడం వల్ల నేడు ఆపదలో ఉన్నవారికి, గర్భిణులకు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి సకాలంలో అవసరమైన రక్తం అందుతుంది.

గ్రూపుల్లో మెసేజ్ పెడితే చాలు..
వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్‌మీడియా గ్రూపుల్లో రక్తం అవసరం ఉన్న వారి వివరాలు పెడితే చాలు రక్తదాతలు ముందుకువస్తున్నారు. కొంతమంది దూర ప్రాంతాలకు వెళ్లి కూడా రక్తదానం చేస్తున్నారు.

క్యాంపుల్లో స్వచ్ఛందంగా రక్తదానం
సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్న బ్లడ్ డోనేషన్ క్యాంపులకు ఉద్యోగులు, విద్యార్థులు, యువత వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. మగవారితో పాటు సమానంగా మహిళలు కూడా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల పోలీసు, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు బ్లడ్ క్యాంపులు నిర్వహించి ఉద్యోగులు ద్వారా రక్తదానం చేయించారు.

ఏడాదికి 20 వేల యూనిట్ల రక్తం సేకరణ
జిల్లాలో రక్తదానం ద్వారా ఏడాదికి 19,000 యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు. ఏడాదికి 20 వేల యూనిట్ల రక్తం అవసరం అవుతుంది.

53 సార్లు రక్తదానం



గోపిశెట్టి సత్యనారాయణ

ఆకివీడు: ఆకివీడుకు చెందిన గోపిశెట్టి వెంకట సత్యనారాయణ 23 ఏళ్ల వయసులో రక్తదానం చేశారు. హీరో చిరంజీవి అభిమాన సంఘం ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించేవారు. ఏటా చిరంజీవి పుట్టినరోజుకు, ఇతర కార్యక్రమాల సమయంలో తాను రక్తం ఇవ్వడంతో పాటు ఇతరులు రక్తదానం చేసేలా ప్రోత్సహించేవారు. ఏడాదికి రెండు, మూడు సార్లు రక్తదానం చేసేవారు. ప్రస్తుతం ఆయన వయసు 51 సంవత్సరాలు.. ఇంతవరకూ 53 సార్లు రక్తదానం చేశారు.

జిల్లాలో మొత్తం 8 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. వాటిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 2, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1, ప్రైవేట్ బ్లడ్ బ్యాంకు సంస్థలు 5 ఉన్నాయి.

ఎవరు అడిగినా రక్తదానం చేస్తున్నాను



నేను కిరాణా వ్యాపారం చేస్తున్నాను. నా బ్లడ్ గ్రూప్ ఏ పాజిటివ్. ఇప్పటికి 56 సార్లు రక్తదానం చేశాను. 1996లో రక్తదానం చేయడం ప్రారంభించాను. ఎప్పుడు ఎవరు వచ్చి రక్తం అవసరమని అడిగినా వెంటనే ఇస్తాను. ఎప్పుడు రక్తం అవసరమైనా 9505048928 నెంబరులో అందుబాటులో ఉంటాను.

– వీరా భాస్కరరావు, ఏ పాజిటివ్, కిరాణా వ్యాపారి, పాలకొల్లు

అత్యవసర సమయంలో ఆదుకున్నాను



గతంలో మా బంధువులను తీసుకుని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళాను. అక్కడ ఓ మహిళకు ఏబీ పాజిటివ్ బ్లడ్ కావాలని అనుకుంటున్నారు. ఈ గ్రూప్ బ్లడ్ చాలా అరుదుగా దొరుకుతుంది. అది విని తనది ఏబీ పాజిటివ్ అని చెప్పగా రక్తం పరీక్షించి సరిపోతుందన్నారు. అత్యవసర సమయంలో ఆదుకున్నందుకు అందరూ అభినందించారు. ఇప్పటికి 52 సార్లు రక్తదానం చేసాను. నా ఫోన్ నెంబరు 9666447955లో సంప్రదిస్తే అవసరమైనప్పుడు రక్తదానం చేస్తాను.

– మంద రామారావు, వైండింగ్ వర్కర్, పాలకొల్లు

16న ఐటీఐల్లో కౌన్సెలింగ్

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలలో 2023–24 విద్యాసంవత్సరానికి ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 16న నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. 334 మార్కులు పైగా వచ్చిన అభ్యర్థులు 16వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి, 334 లోపు అభ్యర్థులు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

ఆక్వా వర్సిటీ తరగతుల నిర్వహణకు సన్నాహాలు



లక్ష్మణేశ్వరంలో తుఫాను షెల్టర్‌ను పరిశీలిస్తున్న వర్సిటీ ఓఎస్డీ సుధాకర్, చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఆక్వా యూనివర్సిటీ తరగతులను ఈ విద్యాసంవత్సరం నుంచి నరసాపురంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓ వైపు ఇప్పటికే లిఖితపూడి గ్రామంలో యూనివర్సిటీ శాశ్వత భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అడ్మినిస్ట్రేషన్, హాస్టల్ భవనాల నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు అనువైన భవనాలు పరిశీలిస్తున్నారు. లక్ష్మణేశ్వరంలోని తుఫాను రక్షణ భవనాన్ని యూనివర్సిటీ ఓఎస్డీ సుధాకర్‌తో కలసి ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు.

నేడు మంత్రి అప్పలరాజు పర్యటన
నరసాపురం: మత్స్యశాఖ మంత్రి బుధవారం నరసాపురంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ముదునూరితో కలిసి లిఖితపూడిలో ఆక్వా యూనివర్సిటీ పనులు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 4 గంటలకు లక్ష్మణేశ్వరం పరసావారి మెరక గ్రామంలో తుఫాన్ షెల్టర్ భవనంలో ఆక్వా యూనివర్సిటీ తాత్కాలిక తరగతి గదులను ప్రారంభిస్తారు. 4.30 గంటలకు బియ్యపుతిప్పలో ఫిషింగ్‌హార్బర్ నిర్మించనున్న ప్రాంతంలో స్థల పరిశీలన చేస్తారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడం ద్వారా చెత్తను బయట పారవేయడాన్ని నిరోధించవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ‘స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023’ అనే అంశంపై ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని గ్రామీణ పరిశుభ్రతకు చేపట్టాల్సిన అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతకు తొలిమెట్టు చెత్త వేయకుండా ప్రజల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడమే అన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించగలరన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించినప్పుడే సత్ఫలితాలను సాధించగలమన్నారు. చెత్త వేయకుండా ఉండడం, ఎక్కడ వేయాలో తెలియజేయడం, ప్లాస్టిక్ బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వర్క్‌షాప్‌లో పంచాయతీ అధికారి జీవీకె మల్లికార్జున రావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎ.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ



విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్, అనుమతులు తదితర అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఉపరవాణా కమిషనరు ఎస్.శాంతకుమారి తెలిపారు. ఏలూరులో ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహించిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని స్కూల్, కాలేజీ బస్సులపై 5 కేసులు, పర్మిట్ లేని స్కూల్, కాలేజీ బస్సులపై 2 కేసులు ఇతర వాహన రికార్డు లేని బస్సులపై 4 కేసులు నమోదు చేశామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఏలూరు ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, సహాయ మోటారు తనిఖీ అధికారి టీవీ కృష్ణవేణి, జీ.స్వామి పాల్గొన్నారని తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు యూనిట్ పరిధిలో మొత్తం 568 విద్యా సంస్థల బస్సులు ఉండగా వాటిలో 419 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యువల్ చేసుకున్నారని, మరో 149 బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాల్సి ఉందన్నారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా శాఖ పరిధిలో 242 బస్సులకు గాను 150 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి కాగా 92 మిగిలి ఉన్నాయన్నారు. నూజివీడు పరిధిలో 154 బస్సులకు 108 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి కాగా 46 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యువల్ చేయించాల్సి ఉందన్నారు.

మహిళపై యాసిడ్ దాడి

- తీవ్రంగా గాయపడిన బాధితురాలు
- ఏలూరులో ఘటన
- తొలుత ఏలూరుకు, అక్కడినుంచి విజయవాడకు తరలింపు
- దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు



బాధితురాలు యడ్ల ఫ్రాన్సికాను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం, ఘటనాస్థలం వద్ద డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, (ఇన్‌సెట్‌లో) ఫ్రాన్సికా (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు గ్జేవియర్ నగర్‌లోని ఒక డెంటల్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న యడ్ల ఫ్రాన్సికా (35)పై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దారికాచి యాసిడ్‌తో దాడి చేశారు. ఆమెకు వివాహమై ఏడేళ్లు కాగా, ఆమె భర్త దెందులూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కెమికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. రెండేళ్లుగా భర్త నుంచి విడిగా ఉంటోంది. ఏలూరు నగరంలో ఉంటున్న ఆమె.. స్థానిక స్మార్ట్ డెంటిస్ట్రీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఆస్పత్రిలో విధులు ముగించుకొని ఒంటరిగా స్కూటీపై ఇంటికి వెళుతుండగా, ఆమె నివాసానికి సమీపంలో దారికాచిన ఇద్దరు ఆగంతకులు తమ బైక్‌తో అటకాయించారు. వెంటనే ఆమెపై యాసిడ్‌తో దాడి చేశారు. యాసిడ్ ప్రభావంతో మంటలు తాళలేక ఆమె కేకలు వేయడంతో నిందితులు అక్కడినుంచి పరారయ్యారు. స్థానికులు గుర్తించి వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి సమాచారం అందుకున్న ఏలూరు రేంజి డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితురాలితో పాటు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన వివరాలు వారి నుంచి ఆరా తీశారు. అనంతరం సంఘటనాస్థలానికి చేరుకొని దాడి జరిగిన ప్రదేశాన్ని బాధితురాలి స్కూటీని, ఆమె నివాసాన్ని పరిశీలించారు. వారి తల్లిదండ్రులతో ఇంటివద్ద ఈ ఘటనపై ఆరా తీశారు. ప్రాథమిక వైద్యం అనంతరం ఆమెను మెరుగైన వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై డీఐజీ మాట్లాడుతూ పూర్తి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఆమె భర్త వైపు నుంచి.. అలాగే పరిచయమున్న ఇతర వ్యక్తులెవరైనా ఈ దాడికి పాల్పడ్డారా అనే వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. బాధితురాలికి 40 శాతం ముఖం కాలిపోయినట్టు వైద్యుల ద్వారా అందిన సమాచారం. బాధితురాలు ఆమె చెల్లి కుటుంబంతో పాటు ఏలూరులో ఉంటోంది. బాధితురాలి స్వస్థలం కూడా దెందులూరు అని, తల్లిదండ్రులు అక్కడే ఉంటున్నారని సమాచారం.

క్లుప్తంగా

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి వివిధ రూపాల్లో రూ.1,66,834 ఆదాయం వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు చెప్పారు. ఏలూరు జిల్లా దేవదాయ శాఖ అధికారి సీహెచ్ రంగారావు స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రం గరావు పాల్గొన్నారు.

15 నుంచి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: డాక్టర్ వైఎస్సార్ (కడప) జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు జరగనున్నాయని ఏలూరు జిల్లా ముఖ్య శిక్షకులు బి.శ్రీనివాసరావు మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. 4, 5 తరగతుల బాలికలు 20, బాలురు 20 మంది మొత్తం 40 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ఇం దుకోసం ఈ నెల 15వ తేదీ నుంచి 20 వరకు మండల స్థాయిలో, 22వ తేదీ నుంచి 26 వరకూ జిల్లా స్థాయిలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో 13 పాయింట్లు సాధించిన వారు ఈ నెల 29, 30 తేదీల్లో గుం టూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనేం దుకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. పుట్టిన తేదీ, స్టడి సర్టిఫికెట్లతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఎంపిక పోటీలకు హాజరుకావాల న్నారు. మరింత సమాచారం కోసం 98663 17326 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదిం చాలని సూచించారు.

వరి గడ్డి కాల్చితే పోషకాలకు పాతర

- చేలల్లో వరిగడ్డి కాల్చితే అన్నీ అనర్థాలే
- వేడితో మిత్ర కీటకాలు, శిలీంద్రాల మృతి
- సహజ ఎరువులు, పర్యావరణానికి నష్టం

సాక్షి, భీమవరం: వరిగడ్డిని చేలల్లోనే వదిలి కాల్చి వేయడం వల్ల అనేక దుష్పరిణామాలు తలెత్తుతు న్నాయని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తు న్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వరిమాసూళ్లలో వరికోత యంత్రాలను ఉపయో గించడంతోపాటు పశువుల సంఖ్య తగ్గడం, కూలీల ఖర్చు పెరగడంతో వరిగడ్డిని గతంలో మాదిరిగా రైతులు ఒబ్బిడి చేయడం లేదు. దీంతో యంత్రాలతో మాసూళ్లు చేసిన చేలల్లోనే గడ్డిని వదిలివేసి తగలబెడుతున్నారు. ఈ పద్ధతి గతంలో కేవలం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఈ విధానం దేశమంతా పాకింది.

నష్టాలు ఇవే..

రైతులు పొలంలో గడ్డిని మండించడం వల్ల కలిగే వేడి సుమారు ఒక సెంటి మీటరు లోతు వరకు చేరుతుంది. దీనివల్ల క్రమేపీ భూములు నిర్జీవంగా మారిపోతాయి. అంతేగాకుండా వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటలను



వరిచేలలో గడ్డిని తగలబెడుతున్న దృశ్యం

ఆశించే చీడపీడల ఉధృతి క్రమేపీ పెరిగిపోతుంది. టన్ను గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల ఫాస్పరస్, 2.5 కిలోల పొటాషియం, 1.0 కిలోల సల్ఫర్‌తోపాటూ నేలలో ఉండే సేంద్రియ కర్బనాన్ని కూడా కోల్పోతుందని శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలలో తేలింది. అంతేగాకుండా గడ్డిని తగలబెట్టడం ద్వారా వ్యాపించే పొగ వల్ల 76 శాతం మందికి కళ్ల మంటలు, 44.8 శాతం మందికి ముక్కులో మం ట, 45.5 శాతం మంది గొంతు నొప్పి బారిన పడి నట్టుగా గుర్తించారు. అంతేకాక గడ్డి తగలబెట్టడం వల్ల వచ్చే పొగను పీల్చడంవల్ల నుశి ఊపిరితిత్తు లలో పేరుకుని ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాస సంబంధ రుగ్మతలు ఏర్పడుతున్నట్టుగా తేలింది. పంజాబ్ రాష్ట్రంలో పొలంలోని వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ ద్వారా కలిగే అనారోగ్యాలను నివారించడానికి ప్రభుత్వం ప్రతి ఏటా రూ.7.6 కోట్లు ఖర్చు చేస్తుండడం గమనార్హం

పంట వ్యర్థాల సమర్థ వినియోగానికి ప్రత్యామ్నాయాలు

ప్రస్తుతం పంట వ్యర్థాల సమర్థ వినియోగంపై శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్ట్ చేయడం వల్ల ఎంతో విలువైన సేంద్రియ ఎరువు తయారవుతుం ది. సేంద్రియ ఎరువులు పర్యావరణ హితమైనవే గాక సాగు ఖర్చును తగ్గిస్తాయి. వరి గడ్డి పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉప యోగపడుతుంది. అంతేగాక కొన్ని ప్రైవేటు సం స్థలు వరిగడ్డిని ఉపయోగించి ప్యాకింగ్ మెటీ రియల్, కార్డ్ బోర్డులు, ప్లేట్స్, స్పూన్లు, బయో ఇథ నాల్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీరికి గడ్డిని విక్రయించుకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చు.

అనర్థాలను రైతులు గుర్తించాలి



చేలలో వరిగడ్డిని తగల బెట్టడం వల్ల అనేక అన ర్థాలున్నాయి. గడ్డి తగల బెట్టిన వేడి వల్ల భూమికే కాక మనుషు లకు తీవ్ర నష్టా లున్నాయి. గడ్డిని సమర్థంగా వినియోగించు కోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమే గాక రైతులు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం

కిరోసిన్ నిల్వ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు

నరసాపురం: ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే కిరోసిన్‌ను అక్రమంగా నిల్వ ఉంచిన కేసులో నేరం రుజువు కావడంతో నరసాపురం పట్టణానికి చెందిన జక్కం కాశీ అనే వ్యక్తికి 6 నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరి మానా విధిస్తూ నరసాపురం అడిషనల్ జ్యుడీషి యల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2016 ఆగస్టు 11వ తేదీన రైల్వేస్టేషన్ రోడ్డులో కాశీ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 3,800 లీటర్ల కిరోసి న్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కాశీ, మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మొదటి నిందితుడి కాశీపై నేరం రుజువు కావడంతో కోర్టు మంగళవారం శిక్ష విధించినట్టు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కె.ఉదయభాస్కర్ చెప్పారు.

వివాహితను వేధించిన వ్యక్తికి రిమాండ్

భీమడోలు: సూరప్పగూడెంలో ఓ వివాహితను లైం గిక వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడ్ని భీమ డోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుప ర్చగా రిమాండ్ విధించారు. వివరాల్లోకి వెళితే.. సూరప్పగూడెంకు చెందిన సొడగిరి అజేయ్ ఓ వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడుతు న్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతన్ని సోమవారం రాత్రి భీమడోలు పోలీసులు అదుపు లోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ చెప్పారు.

థ్యాంక్యూ.. సీఎం సార్

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏపీజేఏసీ అమరావతి నాయకులు

ఏలూరు (మెట్రో): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లలో కొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం చాలా సంతోషంగా ఉందని ఏపీజేఏసీ అమరావతి ఏలూరు జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏపీజేఏసీ అమరావతి నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ డిమాండ్‌లను పరి ష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజేఏసీ అమ రావతి ద్వారా డిమాండ్‌ల సాధనకై 92 రోజులు ఉద్యమం చేశామన్నారు. తమ డిమాండ్‌లను మన్నించి కొన్నింటిని పరిష్కరించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. రాష్ట్రంలో ఉన్న 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి క్యాబినేట్ ఆమోదించడం, కొత్తగా ఏర్పడిన జిల్లాల హెడ్ క్వార్టర్‌లకు 16 శాతం హెచ్ ఆర్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ కోసం రూ.3,600 కోట్లు,



సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీజేఏసీ అమరావతి నాయకులు

సీపీఎస్ ఉద్యోగుల 10 శాతం వాటా రూ.2,400 కోట్లు చెల్లించినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. అలాగే మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులను దశల వారీగా రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించాలని, సంవత్సర ఆదాయం రూ.1.40 లక్షలు కన్నా తక్కువ ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా చూడాలని సీఎంను కోరగా, సాను కూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

స్త్రీ నిధి సొమ్ము రూ.14 లక్షలు స్వాహా

- సభ్యులు చెల్లించినా బ్యాంకుకు జమ చేయని వీఓఏ సూర్యకుమారి
- పోలీసులకు గత నెల ఫిర్యాదు చేసినా చర్యలు లేవంటూ వైకేపీ ఏపీఎం, సీసీ ఆరోపణ

మొగల్తూరు: స్త్రీ నిధి రుణాల సొమ్ము రూ.14,62,176లను బ్యాంకుకు జమ చేయకుం డా సొంతానికి వాడుకున్న వీఓఏ మద్దాల సూర్య కుమారి వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వైఎస్సార్ కాంతి పథం ఏపీఎం ఎం.సుభాషిణి, సీసీ సుదర్శన్ ఆరోపించారు. మంగళవారం తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. పేరుపాలెం సౌత్‌కు చెందిన బెల్లంకొండవారి మెరకకు చెం దిన మద్దాల సూర్యకుమారి వీఓఏగా బాధ్యతలు నిర్వహిస్తోంది. ఆ గ్రామంలోని సుమారు 38 సం ఘాలకు రూ.60 లక్షల స్త్రీనిధి రుణం అందించా మన్నారు. సభ్యులు నుంచి ప్రతి నెలా వసూలు చేసిన రుణాల వాయిదా సొమ్ము, వాటా ధనాలు, సభ్యత్వ రుసుము, సీఐఎఫ్ రుణాలకు సంబం ధించి ప్రతి నెలా వీఓఏ వసూలు చేసి బ్యాంక్‌లో స్త్రీనిధి ఖాతాకు జమ చేసి ఆ రసీదును తమకు పంపాలన్నారు. అయితే ఆ గ్రామం నుంచి



మొగల్తూరులో మాట్లాడుతున్న ఏపీఎం సుభాషిణి, సీసీ సుదర్శన్

రికవరీ సరిగా రావడం లేదని గుర్తించి గత ఏడాది డిసెంబర్‌లో సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా, సభ్యులంతా ప్రతి నెలా తాము తీసుకున్న రుణాలకు వాయిదా సొమ్మును వీవోఏకు అందించామని తెలిపార న్నారు. దీనిపై వీఓఏను ప్రశ్నించగా తాను సొం తానికి వాడుకున్నానని, తనకు కొంత సమయం ఇస్తే వాయిదాల రూపంలో జమ చేస్తానని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారన్నారు. నెలలు గడిచినా సభ్యుల సొమ్ము బ్యాంకుకు జమ చేయకపోవడం పై నిలదీసినా సమాధానం చెప్పడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది మే 10న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు సంబంధిత వ్యక్తిపై ఎటువంటి చర్యలు తీసు కోలేదని ఆరోపించారు. దీనిపై ఎస్సై ఎం.వీరబా బును వివరణ కోరగా ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేశామని, అయితే సంబంధిత రికా ర్డులు అందకపోవడంతో ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు.

జాబ్ మేళాలో 151 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఏలూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఏలూరు ప్రభుత్వ డీఎల్ టీసీ /ఐటీఐలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 151 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా నైపు ణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు చెప్పారు. ఈ మినీ జాబ్‌మేళాలో ఏడు కంపెనీలు పాల్గొని ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి హాజరైన 324 మంది అభ్యర్థుల నుంచి 151 మందిని వివిధ కొలువులకు ఎంపిక చేశామన్నారు. అలాగే మరో 34 మందిని తదుపరి దశకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళబూలో మత్తూట్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, మోహన్ స్పిన్‌టెక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల్లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, గోల్డ్ లోన్ ఎగ్జిక్యూటివ్స్, మెషీన్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, డెస్క్ జాబ్స్, ఫోర్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిం



ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి నియామకపత్రం అందజేస్తున్న తమ్మాజీరావు

చాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉగాది రవి, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్, యూత్ ప్రొఫెషనల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. గృహ, వాణిజ్య సముదా యాల మీటర్లను తనిఖీ చేసి అవకతవకలను గుర్తిం చారు. అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న గృహ యజమానులపై జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 49 బృందాలుగా ఏర్పడి 1,468 గృహ సర్వీసులు, 119 వాణిజ్య సముదాయాలు, 303 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 178 సర్వీసులకు అదనపు లోడు ఉన్నట్లు గుర్తించి రూ.9 లక్షలు జరిమానా లుగా విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామా జిక నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే సామాజిక



మీటర్లు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బాధ్యతగా పౌరులు 83310 14951 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీ లలో గుడివాడ ఈఈ టి.రామకృష్ణ, రూరల్ డీఈఈ కె.దశరథన్, ముదినేపల్లి ఏఈ పీవీపీఎస్ రవికు మార్‌తో పాటు డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో పడి వృద్ధురాలి మృతి



మృతురాలు పెచ్చెట్టి భూదేవి

పెనుగొండ: గోదావరిలో పడి ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివ రాలిలా ఉన్నాయి. ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరిలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. దీనిపై సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో బంధు వులు స్పందించి సమాచారం ఇవ్వడంతో వృద్ధు రాలిని ఇరగవరం మండలం పొదలాడకు చెం దిన పెచ్చెట్టి భూదేవి (70)గా గుర్తించారు. భూదేవికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. సోమవారం పొదలాడ నుంచి పెను మంత్ర మండలం ఆలమూరు వద్ద ఆటో ఎక్కి యలమంచిలికి వెళుతూ మార్టేరులో దిగి కోడేరు వెళ్లినట్లు చెబుతున్నారు. అయితే అక్కడ గోదావ రిలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిందా లేక ఆత్మహత్యకు పాల్పడిం దనే వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



మృతి చెందిన జాని మియా (ఫైల్)

కుక్కునూరు: వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండల కేంద్రం కుక్కునూరులోని సినిమా హాల్ సెంటర్‌లో నివాసం ఉండే షేక్ జానిమియా (72) మంగళవారం ఇంటి సమీపం లోని షాపు వద్దకు వెళ్లాడు. షాపు నుంచి ఇంటికి రాగానే నిరసంగా ఉందని చెబుతూ స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అత నిని ఆసుపత్రికి తరలించారు. జానిమియాను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్టు నిర్ధారించారు.

రజక చెరువుల ఆక్రమణలు అరికట్టాలని వినతి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: గ్రామ పంచాయతీల్లో రజకుల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, కొన్ని గ్రామాల్లో రజకులకు చెరువుల కేటాయించాలని డీపీఓ జి.మల్లికార్జునరావుకు విజ్ఞప్తి చేసినట్లు ఉమ్మడి జిల్లా రజక సంఘ అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య చెప్పారు. మంగళవారం డీపీఓను కలిసిన అనంతరం పెదకాప వరంలో రజక చెరువు పూడిక తొలగింపు పనులను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీలు పాత చెరువుల్ని తవ్వించి, వాటి అభివృద్ధికి సహకరించాలని డీపీఓకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. దీనిపై డీపీఓ మల్లిఖార్జున రావు స్పందించి రజక వృత్తిదారులకు సహకరి స్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. జిల్లా రజక నాయకులు కె.వెంకటే శ్వర్లు, గౌరవధ్యక్షులు బీ.మహంకాళి, యువజన కార్యదర్శి విఠల్ శ్రీనివాస్, పెదకాపవరం రజక సంఘ నేతలు బి.సత్యనారాయణ, శం కరపు మహాలక్ష్మి పాల్గొన్నారు.

చికెన్ ధరకు రెక్కలు

- ఎండ తీవ్రతతో చనిపోతున్న కోళ్లు
- కిలో రూ.330కు చేరిన స్కిన్‌లెస్ రేటు
- తగ్గిన మాంసం, గుడ్ల ఉత్పత్తి



తణుకు: చికెన్ ధరలు మాంసంప్రియులకు చుక్క లను చూపుతున్నాయి. ఎండల ధాటికి ఉష్ణతాపం పెరిగి కోళ్లు మృత్యువాత పడుతుండటంతో మాం సం ఉత్పత్తి తగ్గగా, డిమాండ్ పెరిగి ధరపై ప్రభావం చూపుతున్నాయి. నెల రోజుల క్రితం వరకు కిలో స్కిన్‌లెస్ రూ.230, స్కిన్ చికెన్ రూ.200 ధర పలకగా ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బ్రాయిలర్ చికెన్ ధర రూ.330కు, స్కిన్‌తో రూ.300 పలుకుతోంది. ఈ ధరలు చూసి కొను గోలు చేసేందుకు వినియోగదారులు ముందుకు రావడంలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారాలు మంద గించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల మండుటెండలకు బ్రాయిలర్ కోళ్లు చనిపోవడం, తగినంత దాణా తీసుకోకపోవడం వంటి కారణా లతో చికెన్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. మరోవైపు ఎండల ప్రభావంతో గుడ్ల ఉత్పత్తి కూడా 20 శాతానికి తగ్గింది.

ఇంకా పెరిగే అవకాశం

గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో చికెన్ ధరలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎం డల తీవ్రతకు మాంసం ఉత్పత్తి పడిపోవడంతో కిలో రూ.330 వరకు చేరిన చికెన్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతు న్నారు. సాధారణంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే కోళ్లు తట్టుకోలేవు. ప్రస్తుతం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదవు తోంది. ఈ పరిస్థితుల్లో కోళ్లను కాపాడుకునేం దుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. నెల రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం తో కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. పౌల్ట్రీ ఫారాల్లో పెంచుతున్న కోళ్లు వడగాలులకు తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి. పౌల్ట్రీ రైతులు సైతం ఏప్రిల్, మే నెలల్లో వీటి ఉత్పత్తికి వెనుకంజ వేస్తూ వచ్చారు. ఫలితంగా కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడం తద్వారా ధరలు అమాంతం పెరిగి పోయాయి. సాధారణంగా వేసవిలో కోళ్లు 6 శాతం వరకు మృత్యువాత పడుతుంటాయి. ఈ సారి వడగాలుల తీవ్రత తారాస్థాయికి చేరడంతో 16 శాతానికి పైగా మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. రెండు కిలోల కోడి తయారు కావడానికి 40 రోజులు సమయం పడు తుంది. వేసవిలో మేత సరిగ్గా తినకపోవడంతో 60 రోజులు పడుతోంది. ఈ పరిస్థితుల్లో అను కున్న సమయానికి కోళ్లు ఉత్పత్తి కావడంలేదు. ఈ పరిస్థితుల్లో పౌల్ట్రీ రైతులు నష్టాలబాట పడుతు న్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచు తున్నారు. గతంలో లైవ్ చికెన్ ధర కిలో రూ.110 ఉండగా, ప్రస్తుతం రూ.160 పలుకుతోంది.

కోళ్ల ఉత్పత్తి పడిపోయింది

సాధారణంగా ఎండాకాలంలో చికెన్ ధర తగ్గుముఖం పడుతుంది. ఈ సారి ఎండల తీవ్రత కారణంగా కోళ్లు మృత్యువాత పడుతుండటంతో మాంసం దిగుబడి తగ్గింది. మరోవైపు కోళ్ల ఫారాల నుంచి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు పెరిగాయి. దీంతో గత కొద్ది రోజులుగా కోళ్ల ఉత్పత్తి పడిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా చికెన్ ధర పలుకుతోంది. దీంతో గతంతో పోల్చితే 50 శాతం అమ్మకాలు పడిపోయాయి.

– గణేష్, చికెన్ వ్యాపారి, తణుకు

ఎఫ్‌పీఎస్‌లో డీఆర్పీలుగా ఉద్యోగావకాశాలు

సాక్షి, భీమవరం: ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్)లో కాంట్రాక్ట్ పద్ధతిలో జిల్లా రిసోర్స్ పర్సన్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఎ.దుర్గేష్ మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు.ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, అలాగే వ్యవసాయం, ఉద్యాన డిగ్రీ లేదా ఇతర డిగ్రీ కలిగి బ్యాంకింగ్‌పై అవగాహన కలిగిన అభ్య ర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. ఎం పికైన వారు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఆహార పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహికులకు అవ గాహన కల్పించడం, బ్యాంకు లింకేజి చేయించ డంతోపాటు ఆహార పరిశ్రమల స్థాపనకు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్య ర్థులు తమ బయోడేటాను పోస్ట్‌లో లేదా ఇ-మెయిల్ ద్వారా ఈ నెల 30వ తేదీ లోగా పం పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం భీమ వరం కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ కార్యా లయంలో సంప్రదించాలని దుర్గేష్ కోరారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

దెందులూరు: దెందులూరులో రెండు ఎకరాల ఆయిల్‌పామ్ తోట దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఏఓ గద్దె రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటను పరిశీలిం చారు. పెద్దిశెట్టి ఉమామహేశ్వరరావు, ప్రభాకర్‌కు చెందిన రెండున్నర ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ తోటలు ఉండగా సమీప రైతు పొలంలోని వరిచేల దుబ్బులకు మంట పెట్టడంతో అవి తోటలకు వ్యాపించాయి. దీంతో ఆయిల్‌పామ్ తోట దగ్ధమైం దని బాధిత రైతులు వివరించారని మండల వ్యవ సాయాధికారి గద్దె రమేష్ తెలిపారు.

క్లుప్తంగా

38 మందికి వైద్య సేవలు



తణుకులో ఉచిత వైద్యం అందిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వైద్యులు, నాయకులు

తణుకు అర్బన్: స్థానిక సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన 38 మందికి డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్ర బాబు వైద్యసేవలందించి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. రోగులకు ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సభ్యులు కె.సాధు, ఇవటూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు

పెంటపాడు: పెంటపాడు కోనేరు చెరువు గట్టున నూతనంగా నిర్మించిన పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు మంగళవారం కొనసాగాయి. పెంటపాడు విశ్వ కర్మసంఘ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పూజలు జరిగాయి.

నేడు దర్శిపర్రులో గడపగడపకు...

పెంటపాడు: గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సాయంత్రం దర్శిపర్రులో నిర్వహించనున్నట్లు పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీవీ రామప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు రుద్ర ధనరాజు అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు తణుకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గోవాలని కోరారు.

గూడెం స్టేషన్‌కు ఎమ్మెల్యే నిమ్మల

తాడేపల్లిగూడెం రూరల్: యలమంచిలి మండలం పెరుగులంక ప్రాంతాన్ని పరిశీలించడానికి అనుమతి లేకుండా వెళుతున్న పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకొని తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రానికి ఆయన్ని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం గ్రామ శివారు ప్రాంతంలో పేకాట శిబిరం మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 4,800లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొగల్తూరు: రోడ్డుపై పడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.వీరబాబు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మొగల్తూరు సత్రవు పాలెంకు చెందిన దొంగ సత్యనారాయణ (65) మంగళవారం పడమటిపాలెంలోని పొలానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని హైవేపై ప్రమాదవశాత్తూ పడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతడ్ని భీమవరం తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

పేద విద్యార్థుల చదువుకు పథకాల భరోసా



సంజీవనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేస్తున్న కర్రి భాస్కరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేద పిల్లల చదువులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్న భరోసా అనితర సాధ్యమైనదని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు అన్నారు. దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలోని పాతూరు 10, 12 వార్డుల ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో మంగళవారం సంజీవనగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పిల్లలకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, స్కూల్ యూనిఫారంలు, బూట్లు, సాక్స్ అందజేశారు. తాగడానికి విద్యార్థులకు రాగి జావ అందించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామభద్రం, వార్డుల ఇన్‌చార్జిలు అడ్డాల నరసింహారావు, చామన సూర్యచంద్రరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆరిమిల్లి రవి పర్యవేక్షించారు. కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గతంలో పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చారని కొనియాడారు. ఏఎంసీ డైరక్టర్ కోడే శ్రీనివాస్, నౌషాద్ మోహీద్దీన్, ఆలంకొండ, చామన ప్రసాద్, పెనుగొండ ఆంజనేయులు, వి.రాంబాబు, కె.మల్లికార్జునరావు, దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చక్కని చదువులకు భరోసా అద్వితీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద, మధ్య తరగతి పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న భరోసా అద్వితీయమైనదని 13వ వార్డు ఇన్‌చార్జి తెన్నేటి జగ్జీవన్ అన్నారు. వార్డులోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. జగ్జీవన్ మాట్లాడుతూ బడులు తెరిచిన తొలి రోజుల్లోనే పిల్లలందరికీ జగనన్న విద్యా కానుక అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం అభినందనీయమని తెలిపారు. సచివాలయం కన్వీనర్స్ డి.శేఖర్, ఎర్రంశెట్టి కృష్ణవేణి, కె.దేవిక, ఎస్.సూర్యచంద్రం, ప్రసాద్, శివ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక 34వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి వట్టి బుజ్జి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వట్టి బుజ్జి మాట్లాడుతూ మధ్యతరగతి, పేద వర్గాలకు విద్యను ఉచితంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

పెంటపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అందిస్తున్న జగనన్న కిట్లు సద్వినియోగం చేసుకోవాలని మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య పేర్కొన్నారు. జగనన్న విద్యాకానుక కిట్‌ల పంపిణీలో భాగంగా దర్శిపర్రు, బిళ్లగుంట ప్రాంతాల్లోని 4 పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, షూలు, నోటు, టెక్స్ట్ బుక్స్‌ను తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేసారు. ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, పార్టీ అధ్యక్షుడు గుండుమోగుల మునీంద్ర, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, నారాయణ, స్కూళ్ల విద్యాకమిటీ చైర్మన్లు, సీఆర్‌పీ చిట్టెమ్మ పాల్గొన్నారు. రావిపాడులో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, ఉప్పులూరి హరి పాల్గొన్నారు. గ్రామంలోని మూడు పాఠశాలల విద్యార్థులకు విద్యాకానుక కిట్‌లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్, ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, పూడి శ్రీను పాల్గొన్నారు. రామచంద్రపురంలో పార్టీ నాయకులు చల్లా లింగమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, మీనవిల్లూరులో బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, చింతపల్లిలో దాట్ల రామలింగరాజు, పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజు, వేమలమంద జానకిరామరాజు మండల వైస్ ఎంపీపీ ముప్పిడి సరోజిని తదతరులు స్కూలు ఉపాధ్యాయులతో కలిసి జగనన్న విద్యాకానుక కిట్‌లు విద్యార్థులకు పంపిణీ చేసారు.

నేడు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

అత్తిలి: మండలంలోని వరిఘేడు, బల్లిపాడు, మంచిలి, ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

జగన్నాథపురంలో ..

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో వేగవంతంగా సాగింది. దీనిలో భాగంగా జగన్నాథపురంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, పడాలలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ గంగాభవాని, వెంకట్రామన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలిమోను శ్రీనివాస్ తదితరులు జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



34వ వార్డులో ఇన్‌చార్జి వట్టి బుజ్జి ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేస్తున్న దృశ్యం



దర్శిపర్రులో విద్యాకానుక కిట్‌లు అందిస్తున్న పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపం మొదటి అంతస్తు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామి దేవస్థానం కల్యాణ మండపం మొదటి అంతస్తు భవనాన్ని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ భక్తులకు ఉపయోగపడే విధంగా కల్యాణ మండపం అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, మద్దాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సొసైటీ అధ్యక్షులు గుబ్బల ఆంజనేయులు, ఆకుల బులి నాగేశ్వరరావు, ధనుమూరి వెంకటేశ్వరరావు, ఈవో చందక దారబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

సాక్షి, భీమవరం : ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులను మంగళవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి విద్యనభ్యసిస్తే ఇంజనీరింగ్ విద్యార్థులు మాదిరిగా డిగ్రీ విద్యార్థులు కూడా మంచి ఉద్యోగావకాశాలు సాధించవచ్చునన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన పి.రిషిత, జి.భవానిలకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావూళ్ళు, ప్లేస్‌మెంట్స్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్స్ రవీంద్ర, బ్రహ్మం, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయిలో విద్యా ప్రమాణాల కోసం కృషి



జగన్నాథపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థుల పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో సీతారాంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం జన్‌భగీదారీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వార్డుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఉన్నతస్థాయిలో విద్యా ప్రమాణాలను అందుకునే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఎం.ఎస్.కె నలంది, అంగన్‌వాడీ కార్యకర్త బి.శ్రీదేవి, ఇందిర, విజయ కుమారి, పద్మావతి, రామలక్ష్మి, నాగేశ్వరి, గర్భిణులు, బాలింతలు, బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలపై అవగాహన కోసం 'జన్‌భగీదారి'

తాడేపల్లిగూడెం రూరల్: పిల్లల ఎదుగుదలపై అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలే కాకుండా కుటుంబ స్థాయిలో కార్యాచరణపై అవగాహన కల్పించడమే జన భాగీదారి కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రం -141లో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఇష్టమైన ఆట, పాట కథల ద్వారా వారి మనస్సుకు హత్తుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తామన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు సీహెచ్.రజని, బి.అరుణదేవి, అంగన్‌వాడీ సిబ్బంది తులసి, గీత, అంజకుమారి, శాంత కుమారి పాల్గొన్నారు. మాధవరంలోని అంగన్‌వాడీ కేంద్రం- 264లో జనభాగీదారి కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రీ స్కూలు విద్య ఆవశ్యకతను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.చంద్రావతి, వి.కనకమహాలక్ష్మి, పి.హేమలత, ఎం.నాగమణి, కె.ఊదాలమ్మ పాల్గొన్నారు.



మాధవరం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు



దువ్వలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది

దువ్వలో అవగాహన ర్యాలీ

తణుకు టౌన్: మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలందర్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంపీపీ రుద్ర ధనరాజు కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం దువ్వలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డా సూర్యనారాయణ మూర్తి, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు పెనుమాక అశోక్, టీ శ్రీనివాస్, పంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు

తాడేపల్లిగూడెం రూరల్/తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరి ప్రాణాలు ఆపాయంలో ఉన్నట్టేనని, ప్రాణాలను కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కొండ్రుప్రోలులోని కల్యాణ మండపంలో డివిజన్ పరిధిలోని ఏఈలు, విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణ జాగ్రత్తలు తీసుకుంటూ పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదరయ్యే సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలి అనే అంశాలపై వివరించారు. ఇటీవల విద్యుత్ ప్రమాదాల కారణంగా మృతి చెందిన సిబ్బందికి సంతాపం తెలిపారు. వారి ప్రమాదాలకు కారణాలను వివరించి, వాటి నుంచి ఏం నేర్చుకోవాలో అవగాహన కల్పించారు. డిప్యూటీ ఇంజనీర్ రవి, రామకృష్ణ, ఏఈలు శ్రీరామ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఆర్‌ఐ, డీటీలు, మండల సర్వేయర్లు

పెంటపాడు: రైతులు, ప్రజల కోసం సమగ్రంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు పథక రీ సర్వేను వేగవంతం చేయాలని మండల తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటివరకు కె. పెంటపాడు, దర్శిపర్రు, యానాలపల్లి, ఎస్‌ఎ పురం, రావిపాడు, చింతపల్లి, కోరిమిల్లి, వల్లూరుపల్లి, మీనవిల్లూరు, రామచంద్రపురం తదితర 10 గ్రామాలకు సంబంధించి వచ్చిన ఓఆర్‌ఎల్ మ్యాప్‌లను ప్రత్యేక సర్వే చేసి క్షేత్రస్థాయిలో సరి చూసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఈ సర్వే 50 శాతం పూర్తయినట్లు తెలిపారు. మరో వారంలోగా అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేసి రిపోర్టులను సమర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ దీప్తి, ఆర్ఐ కనకదుర్గ, డీటీలు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు



చెరుకుమిల్లి జగనన్న కాలనీలో నిర్మాణ దశలో ఇళ్లు

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. గ్రామంలోని 71 మంది నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో 40 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చాలా ఇళ్లు శ్లాబ్ లెవెల్‌కు వచ్చాయి. మరి కొన్ని వివిధ దశల్లో ఉండగా, నాలుగు ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరిగాయి. కాలనీలో గ్రావెల్ రహదారుల నిర్మాణం జరిగింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే నీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పంచాయతీ ద్వారా పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసినట్లు సర్పంచ్ నందమూరి ప్రకాశం చెప్పారు. విద్యుద్దీకరణ కోసం స్తంభాలను దిగుమతి చేశారు. తాత్కాలిక మీటర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిపివేత

పెనుమంట్ర: మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4658 మంది రైతుల నుంచి 36422.92 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు రవాణా చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జోషిల మంగళవారం తెలిపారు. మండలంలో 35385 మెట్రిక్‌టన్నుల ధాన్యం లక్ష్యం కాగా లక్ష్యాన్ని అధిగమించి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలు పూర్తయినందున మంగళవారం నుంచి కొనుగోలును నిలిపివేసినట్లు ఆమె తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామ రైతులకు విత్తనాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి తెలిపారు. ఎంటీయూ 7029, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. వారికి కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సాక్షి, భీమవరం : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం పట్టణంలోని ఏఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ బ్లడ్‌బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు రక్తదానం, రక్తదాతలకు సన్మానం, అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉండవల్లి రమేష్‌నాయుడు, చెరుకువాడ రంగసాయి, ఎ.వీరయ్య, బి.శ్రీనివాస్, డి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నింపే పనుల ప్రారంభం

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచినీటి చెరువును నింపే పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువు లో నీటిని నింపే పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులోఉంది కాబట్టి 40 రోజులకు సరిపడా నీరు నిల్వఉంటుందని చెప్పారు. వేసవిలోకూడా రెండు పూటలా నీరు ఇవ్వగలిగామన్నాను. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా మంచినీటిని చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై అఖిలపక్ష సమావేశం

యలమంచిలి: చించినాడ పెరుగులంక భూమిలో మట్టి తవ్వకాలపై వివిధ పార్టీల నాయకులు మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. చించినాడ వై జంక్షన్ వద్ద జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తవ్వకాలు ఆపే వరకు పోరాటం చేస్తామని ప్రకటించారు. అనంతరం పెరుగులంక పరిశీలించడానికి అఖిలపక్ష నాయకులు బయల్దేరగా, వారిని దారిలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా పోలీసులను తోసుకుంటూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు అఖిలపక్ష నాయకులను, నిరసన కారులను అదుపులోనికి తీసుకుని పరిస్థితిని అదుపులోనికి తీసుకువచ్చారు.

విభజన హామీలను విస్మరించిన బీజేపీ



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో టీ-బీజేపీగా మారిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. వీకర్స్‌కాలనీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ గతంలో బీజేపీ, టీడీపీ, జనసేనలు మూకుమ్మడిగా పోటీ చేశాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత భారతీయ జనతా పార్టీ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ మోసం చేసినప్పటికీ టీడీపీ అధినేత చంద్రబాబు ఆ పార్టీని ఏమీ చేయలేకపోయారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు సరిపడ నిధులు ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నేటి వరకు దళితులు, దళిత క్రైస్తవులు, ముస్లింలపై దేశ వ్యాప్తంగా ఎన్నో దాడులు జరిగాయని, బీజేపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎన్ని కూటములు కలిసినా రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని మంగరాజు జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో సునీల్, అనిల్, ప్రకాష్, సంపత్ పాల్గొన్నారు.